# బబులోను

మెసపొటేమియా ప్రాంతాన్ని, ఆ ప్రాంతానికి ముఖ్యపట్టణమైన బబులోను పట్టణాన్ని బైబిల్లో తరచుగా బబులోను అని వర్ణించారు. ప్రాచీన అక్కాడియన్ భాషలో బబులోను అంటే దేవుని ద్వారమని అర్థం. క్రీ.పూ 5000 సంవత్సరాల నాటికే బబులోను ప్రాంతంలో ప్రజలు నివసించారు. అయితే, బబులోను గురించి రాతపూర్వకమైన ఆధారాలు క్రీ.పూ. 2200 నుంచి మాత్రమే లభిస్తాయి.

క్రీ.పూ.2000 సంవత్సరానికి కొద్దికాలం తరువాత బబులోనును అమోరీయులు పాలించ డం ప్రారంభించారు.అమోరీయులలో హమ్మురాభి ప్రసిద్ధిగాంచిన రాజు(క్రీ.పూ1792-1750). ఇతను బబులోనులో వున్న చిన్న చిన్న రాజ్యాలను ఒక్క త్రాటిపైకి తెచ్చిన శక్తిమంతమైన రాజు కూడా. హమ్మురాబి శిక్షా స్మృతికి ఆద్యుడు కూడా యితనే. ఈ శిక్షా స్మృతిని నేటికీ మ్మురాబి శిక్షా స్మృతి అనే పిలుస్తారు దీని ఆకృతి శైలి ఇందులోని విషయాలు హెబ్రీ ధర్మ శాస్త్రానికి దగ్గరగా కన్పించినప్పటికీ ఈ రెంటి నడుమ వ్యత్యాసాలు చాలా వున్నాయి. ప్రాచీన కాలంలోని సాహిత్యానికి పాండిత్యానికి బబులోను ప్రసిద్ధి. బబులోను జ్యోతిషానికి కూడా పేరుగాంచిన దేశం (యెషయా 47:13). సొలొమోను కాలంలో (క్రీ.పూ.970-931) ఇశ్రాయేలుకు బబులోను గురించి ఏ ముప్పు కలగలేదు. బబులోనుకు పశ్చిమంగా వున్న ఈజిప్టు ఇశ్రాయేలు దేశాలతో బబులోనుకు వర్తక సంబంధాలుండేవి. సుమారు. క్రీ.పూ.750లో బబులోను పేరు పలుకుబడి వ్యాప్తి చెందసాగాయి. ఈ అభివృద్ధి రాజైన నెబోనజరు క్రీ.పూ747-734) కాలంలో ప్రారంభమైంది. అప్పటికే శక్తిమంతమైన అష్షూరు రాజ్యం బబులోనును తన ఆధీనంలోకి తెచ్చుకొంది. అయితే, కొందరు స్థానికులైన బబులోను అధి పతులు అష్షూరుపై తిరుగుబాటు చేశారు (39:1 వివరణ చూడండి). హిజ్కియా యూదాను పాలిస్తున్న సమయంలో, బబులోను రాజైన రెండవ మెరోదక్బలదాను హిజ్కియా సహాయం కోరడానికి దూతలను యెరూషలేం పంపాడు. ఈ దూతలకు హిజ్కియా ఆహ్వానం పలికి ఇశ్రాయేలు మందిరంలోనూ రాజభవనం లోనూవున్న కోశాగారాన్ని సంపదను చూపించాడు. పర్యవసానంగా, ఒక దినాన్న బబులోను యెరూషలేంపై దండెత్తి యూదా ప్రజలను చెరగొని పోతుందని యెషయా ప్రవక్త హెచ్చరించాడు (39:1-7).

క్రీ.పూ.605ల బబులోను రాజైన నెబుకద్నెజరు అధికారంలోనికి వచ్చాడు నెబుకద్నెజరు. బబులోను పట్టణాన్ని బహు సుందరంగా తీర్చిదిద్దాడు. మనోజ్ఞమైన దేవాలయాలకు, సైనిక విన్యాసాలకు అనువైన విశాలమైన వీధులకు, ప్రపంచ ప్రసిద్ధి చెందిన వ్రేలాడే వుద్యానవనా

లకు బబులోను ప్రసిద్ధి. అయితే, యెషయా ప్రవచించినట్లే, యితను యూదాను ముట్టడించాడు. బబులోనువారు యెరూషలేంను అందులోని దేవాలయాన్ని ధ్వంసం చేసి సంపదను కొల్లగొట్టి అక్కడ నివసిస్తున్న అనేక మంది ప్రజలను బబులోనుకు చెరగొనిపోయారు (2 రాజులు 24:10-25:21).

బబులోనును పాలించిన చివరి రాజు నబోనిడస్ (క్రీ.పూ.555-539). ఇతని నాయకత్వం బలంగా లేకపోవడం వలన ఎక్కువ కాలం యితను దేశాంతరవాసం చేయడం వలన సామ్రాజ్యం బలహీనమైంది. క్రీ.పూ.539లో పారసీక రాజైన కోరెషు బబులనును ఓడించాడు. బబులోనులో నివసిస్తున్న ఇశ్రాయేలు ప్రజలు తమ స్వదేశమైన యూదాకు వెళ్లవచ్చని కోరెషు అనుమతి నిచ్చాడు.

ఇశ్రాయేలీయులు దేవునికి వ్యతిరేకంగా చేసిన పాపానికి వచ్చిన శిక్ష బబులను చెర అని పాత నిబంధన ప్రవక్తలు వర్ణిస్తారు (యెషయా 47:5,6; యిర్మీయా 13:15-20; 25:1-11). క్రొత్త నిబంధనల దేవునికి దేవుని ప్రజలకు శత్రువైన దుష్ట రాజ్యానికి, దుష్ట పట్టణానికి బబులోను అని పేరు పెట్టారు (ప్రకటన 14:8; 17:5; 18:2, 10చ21). అయితే, బబులోను రోమా పట్టణానికి, రోమా సామ్రాజ్యానికి సంకేత నామం కూడా అయ్యిండవచ్చు. 1 పేతురు 5:13 చూడండి.